వైభవంగా సీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ

నెరవేరిన మొండికుంటవాసుల కల

మొండికుంట రామాలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

అశ్వాపురం, మార్చి 9: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ఆదివారం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. దీంతో ఆ ఊరి చిర కాల స్వప్నం నెరవేరింది. ఈ నెల 4వ తేదీ నుంచి ఆదివారం వరకు ఆద్యంతం రామనామ జపం మార్మోగింది. శనివారం మహాయజ్ఞం ముగియడంతో స్వామివారి విగ్రహాలను ఆదివారం మేళతాళాలతో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు.

హాజరైన ప్రముఖులు...

కార్యక్రమానికి పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఆయనతోపాటు మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి హాజరయ్యారు. తమ గ్రామంలో రామాలయాన్ని నిర్మించాలని మొండికుంట మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి తొలి అడుగు వేసి రూ.5 లక్షల విరాళం ఇచ్చారు.

ఊరికోసం ఖండాలు దాటిన శ్రీమంతులు...

అమెరికా వెళ్లి స్థిరపడిన గ్రామస్తులు(ప్రవాస భారతీయులు) ఆలయ నిర్మాణానికి భారీగా విరాళాలు అందించారు. కందిమళ్ల రాఘవరెడ్డి– జానకమ్మ జ్ఞాపకార్థం కుమారుడు సత్యనారాయణరెడ్డి రూ.25 లక్షలు, జాలె నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం కుమారులు సుధాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి రూ.10 లక్షలు, ముద్దం చంద్రకళ, లచ్చిరెడ్డి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు రూ.10 లక్షలు, తిప్పారెడ్డి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం కుమారులు రామిరెడ్డి, విజయభాస్కరరెడ్డి రూ.5 లక్షలు విరాళం అందించారు.

'అంతర్గత' అభ్యర్థులకు రాత పరీక్ష

పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

కొత్తగూడెం సింగరేణి, మార్చి 9: సింగరేణిలో జూనియర్ మైనింగ్ ఆఫీసర్ (ఈ1 గ్రేడ్), జూనియర్ ఆఫీసర్ (ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ ఈ1 గ్రేడ్), జూనియర్ సర్వే ఆఫీసర్ (ఈ1 గ్రేడ్) పోస్టుల భర్తీకి అంతర్గత అభ్యర్థులకు అధికారులు ఆదివారం స్థానిక మహిళా డిగ్రీ కాలేజీలో రాత పరీక్ష నిర్వహించారు. జూనియర్ మైనింగ్ ఆఫీసర్–87 పోస్టులకుగాను 21 మందికి హాల్ టికెట్లు జారీ చేయగా 17 మంది హాజరయ్యారు. జూనియర్ ఆఫీసర్ (ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ ఈ1 గ్రేడ్)–4 పోస్టులకుగాను ఆరుగురికి హాల్ టికెట్లు జారీ చేయగా ఐదుగురు హాజరయ్యారు. జూనియర్ సర్వే ఆఫీసర్ (ఈ1 గ్రేడ్)–64 పోస్టులకుగాను 71 మందికి హాల్ టికెట్లు జారీ చేయగా 67 మంది హాజరయ్యారు. జీఎం (విజిలెన్స్) ప్రసాదరావు, జీఎం (ఈఈ) బెనెడిట్ నికోలస్ పర్యవేక్షించారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం

స్వాధీనపర్చుకున్న డంపుతో భద్రతా దళాలు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చ్ 9: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టుల డంపును, భద్రతా దళాలే లక్ష్యంగా అమర్చిన స్నైపర్‌లను జవాన్లు ఆదివారం స్వాధీన పర్చుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా చింతల్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాలెర్‌గూడ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో కోబ్రా 203, సీఆర్‌పీఎఫ్ బీ/వైపీ/241 బెటాలియన్ జవాన్లు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. మావోయిస్టుల స్థావరం, డంపుతోపాటు భద్రతా దళాలే లక్ష్యంగా ఆ ప్రాంతంలోని గుంతల్లో మావోయిస్టులు ఆ అమర్చిన స్నైప్స్‌ను గుర్తించారు. డంపులో ప్రింటింగ్ మిషిన్, ఇన్వర్టర్, వైర్లు తదితరాలు ఉన్నాయి.

ఇద్దరు మావోయిస్టులు లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట ఇద్దరు మావోయిస్టులు (సుఖ్‌రామ్ పార్సిక్, పండరూ పార్సిక్) ఆదివారం లొంగిపోయారు. వీరిపై రూ.రెండు లక్షల చొప్పున రివార్డు ఉంది.

హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలి

బూర్గంపహాడ్, మార్చి 9: బూర్గంపహాడ్ మండల కేంద్రంలో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయని, ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు పున్నంచంద్ డిమాండ్ చేశారు. హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరిగి అనేక మంది గాయాలపాలయ్యారన్నారు. రాత్రి సమయాల్లో మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో పాటు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద ఇరువైపులా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

హోమియోపతి వైద్యానికి పెరుగుతున్న ఆదరణ

పర్ణశాల, మార్చి 9: మండలంలోని పర్ణశాల పీహెచ్‌సీలో ఏజెన్సీ వాసులకు హోమియో వైద్య సేవలు అందిస్తున్నారు. పట్టణాలకే పరిమితమైన హోమియో వైద్య సేవలు ఏజెన్సీ ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆయుర్వేదం, హోమియోపతి వైద్య సేవలను అందబాటులోకి తీసుకొచ్చారు. గత రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆయుర్వేద, హోమియోపతి వైద్యులను నియమించి వైద్య సేవలు ప్రారంభించింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్‌బాబు మాట్లాడుతూ... మూడు సంవత్సరాల క్రితం పర్ణశాల పీహెచ్‌సీలో హోమియోపతి వైద్య సేవలు ప్రారంభించారన్నారు. ఏజెన్సీ ప్రజలకు హోమియో వైద్యంపై వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. హోమియోపతి మందులు వాడే వారి సంఖ్య రోజురోజూకు పెరుగుతుందని, ప్రతీ రోజు 50 మందిపైనే వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన రోగులు వస్తున్నారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతి మంచి పరిష్కారం చూపుతోందని అన్నారు.

'ఈవెంట్లకు అనుమతి లేదు'

ఖమ్మం అర్బన్, మార్చి 9 : ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో రానున్న హోలీని పురస్కరించుకుని అసంబద్ధమైన, అనర్హమైన ఈవెంట్ జరుగుతున్నదని కొంతమంది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరికీ, ఎటువంటి అనుమతి ఇవ్వలేదని వెల్లడించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

మనుగడ కోసమే మావోయిస్టుల దుశ్చర్యలు

బీజాపూర్‌లో మందుపాతర పేలి గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న చర్ల పోలీసులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 9 : మనుగడ కొనసాగించలేక మావోయిస్టులు తమ ఉనికి కోసం ఏజెన్సీప్రాంత ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేస్తూ కాలం వెల్లదీస్తున్నారని ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీ నాయకులు తమ ఉనికి చాటుకునేందుకు అభివృద్ధిని అడ్డుకుంటూ, ప్రజల ప్రాణాలను ముప్పు తీసుకు వస్తున్నారని అన్నారు. ఆదివాసీ ప్రజలు తమ జీవనం సాగించడానికి నిత్యం సంచరించే ప్రదేశాల్లో మందుపాతరలను అమర్చి గిరిజనులు ప్రాణాలు కోల్పోయే విధంగా మూర్ఖపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. మూడ్రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాంపూర్ గ్రామానికి చెందిన కుంజం పాండే తన సోదరితో కలిసి ఉట్లపల్లి ప్రాంతానికి వెళ్లి తిరిగి వస్తుండగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న చర్ల పోలీసులు వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి ఆమెకు చికిత్స అందించారని పేర్కొన్నారు. ఏజెన్సీ అభివృద్ధి చెందితే తమకు మనుగడ ఉండదని భావించి ఇలాంటి ఆకృత్యాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రజలకు విద్యా, వైద్యం, రవాణా సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పోలీస్‌శాఖ కృషి చేస్తుంటే మావోయిస్టులు మాత్రం విధ్వంసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అమాయకపు ఆదివాసీ ప్రజల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్న మావోయిస్టుల తీరును ఎస్పీ రోహిత్ రాజు తీవ్రంగా ఖండించారు.

ద్విచక్ర వాహనం చెట్టును ఢీ కొని ఒకరు మృతి, మరోకరికి గాయాలు

టేకులపల్లి, మార్చి 9: ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వస్తూ చెట్టును ఢీ కొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని తుమ్మలచెలక స్టేజీ వద్ద ఆదివారం చోటు చేసుకున్నది. సింగరేణి మండలం ఉసిరికాయపల్లి గ్రామానికి చెందిన జోగ వంశీ (22), పీ.ప్రవీణ్ తుమ్మలచెలకలో జరిగిన శుభకార్యానికి వెళ్ళి వస్తున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3.30గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తూ తుమ్మలచెలక స్టేజీ పెద్దమ్మ తల్లి గుడి మూల మలుపు వద్ద చెట్టుకు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వంశీ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.ప్రవీణ్ చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చండ్రుగొండ, మార్చి 9: మండలంలోని తిప్పనపల్లి గ్రామ శివారులోగల ఎదుళ్లవాగులో ఆదివారం తెల్లవారుజామున ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్సై శివరామకృష్ణ పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని పసుపులేటి రాధాకృష్ణపై, డ్రైవర్ రమేష్‌పై కేసు నమోదు చేశారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం

మణుగూరు టౌన్, మార్చి 9: మండలంలో అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాఘవరెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేసినా, ఇసుక నిల్వలు ఉంచినా మైనింగ్ రూల్స్, ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు బుక్ చేసి అట్టి వ్యక్తులను బైండోవర్ చేస్తామని, వాహనాలు సీజ్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని హెచ్చరించారు.

16న 6వ తరగతి ప్రవేశ పరీక్ష

ఇల్లెందు, మార్చి 9: టేకులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 16న ఉంటుందని టేకులపల్లి ఈఎంఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ నిషాంత్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు టీఎస్ఈఎంఆర్ఎస్. సీజీజీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో హాల్ టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

కన్నులపండువగా రామయ్య నిత్య కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, రామయ్య సన్నిధిలో హైకోర్టు జడ్జి సురేపల్లి నంద

భద్రాచలం, మార్చి 9: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణపుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

రామయ్యను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

భద్రాచలం, మార్చి 9: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామిని హైకోర్టు జడ్జి సురేపల్లి నంద ఆదివారం దర్శించుకున్నారు. తొలుత జడ్జికి ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించి గర్భగుడిలో రామయ్యకు పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంలోని ఉప ఆలయాలు శ్రీలక్ష్మీతాయారు, అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించి పూజలు చేశారు. అనంతరం భద్రాచలం జూడిషియల్ కోర్టును సందర్శించారు. తొలుత హైకోర్టు జడ్జి పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. కోర్టు ఆవరణలో మొక్కను నాటి కోర్టు పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, భద్రాచలం జడ్జి శివనాయక్, ఆలయ అధికారులు, అర్చకులు భద్రాచలం జడ్జి శివనాయక్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టీ.చైతన్య, పట్టణ ఎస్సైలు విజయలక్ష్మి, మధుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన దుండగుడిపై చర్యలు తీసుకోవాలి

అశ్వారావుపేట టౌన్: నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు, ఇల్లెందు: మాట్లాడుతున్న కె.సత్య

ఇల్లెందు, మార్చి 9: జగిత్యాల ఆశా కార్యకర్తపై లైంగిక దాడికి పాల్పడిన దుండగుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకురాలు కే.సత్య డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందు పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఆశా వర్కర్స్ యూనియన్, అంగాన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, మధ్యాహ్న భోజన వర్కర్స్ కార్మిక యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంలో సత్య మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అబ్దుల్ నబి, ఈసం వెంకటమ్మ, సుల్తాన, తాళ్లూరి కృష్ణ, ఉమాదేవి, ఎస్‌కే ఫాతిమా, ఆలేటి సంధ్య, లక్ష్మి, యాకమ్మ, రేణుకా పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల నిరసన

అశ్వారావుపేట టౌన్, మార్చి 9: జగిత్యాల జిల్లాలో ఆశ కార్యకర్తపై దుండగుడి దాడిని ఖండిస్తూ ఆశ కార్యకర్తలతోపాటు అంగన్‌వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజన కార్మికులు ఆదివారం స్థానిక రింగ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దుండగుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, నాయకులు కర్నాటి రాధ, భారతి, నాగమణి, రాజేశ్వరి, యామిని, నాగదుర్గ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బూర్గంపహాడ్, మార్చి 9: మండలంలోని అంజనాపురంలోని ప్రాథమిక పాఠశాలలో 1995–96 7వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడు దశాబ్దాల తర్వాత పూర్వ విద్యార్థులు, నాటి గురువులు ఒక్కటయ్యారు. తమ గత అనుభవాలను నెమరువేసుకున్నారు. నాడు చదువు చెప్పిన గురువులు యాకూబ్, నర్సింహారావు, భారతి, సుధామాధవిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆనాడు చదువుకున్న వారంతా వివిధ స్థాయిల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారితో గడిపి అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామారావు, కిషన్, శంకర్‌బాబు, భాస్కరరావు, యాలాద్రి, రమేశ్, ఆనందరావు, రవి, కృష్ణారావు, రమేశ్, ఎంకమ్మ, నాగమ్మ, శ్రీనివాస్, హరిశ్చంద్రప్రసాద్, కైకేయి, రాధాబాయి, కల్యాణి, రాధ, ప్రస్తుత పాఠశాల హెచ్ఎం కిషన్, ఉపాధ్యాయులు బాబూరావు, పద్మ, పూర్వ విద్యార్థుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఇల్లెందు రూరల్, మార్చి 9: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాటి మధు అన్నారు. ఆదివారం స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల భవన్‌లో తుడుందెబ్బ నాయకులతో జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. మూల ఆదివాసీ తెగలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, విద్య, ఉద్యోగ, భూ సంబంధ హక్కులు అమలుకావాలంటే 1976లో వలస వచ్చిన లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలన్నారు. ఏజెన్సీలో మూల ఆదివాసీలకు దక్కాల్సిన జల్, జంగల్, జమీన్‌లపై సర్వహక్కులు రావాలంటే ప్రభుత్వం పీసా గ్రామసభలను పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్లు ముక్తి రాజు, కొడెం వెంకటేశ్వర్లు, నాయకులు రామ్మూర్తి, రామారావు, బొర్ర స్వామి, వెంకటేశ్వర్లు , ఈసాల వెంకటేశ్వర్లు, సతీశ్, హరీశ్, భద్రం, కోటేశ్వరరావు, రాంకుమార్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాసాని దంపతుల విగ్రహాలు ఆవిష్కరణ

కాసాని దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని

కొత్తగూడెం టౌన్, మార్చి 9: సీపీఎం జిల్లా సీనియర్ నాయకుడు కాసాని ఐలయ్య–లక్ష్మి దంపతుల విగ్రహాలను ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆదివారం సుజాతనగర్‌లో ఆవిష్కరించారు. అనంతరం, అక్కడి హైస్కూల్ ఎదురుగా ఐలయ్య సంస్మరణ సభ జరిగింది. సభకు ముందుగా, పార్టీ నాయకులు.. కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. నాయకులు పోతినేని సుదర్శన్, రాజారాం, నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రవన్న వర్ధంతి సభ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

ఇల్లెందు రూరల్, మార్చి 9: మండలంలోని రోంపేడు గ్రామంలో మంగళవారం జరుగనున్న రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు తోడేటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం రోంపేడు గ్రామంలో వర్ధంతి సభపోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. చారుమజుందార్ రాజకీయాలతో ప్రభావితమైన రవన్న 47 సంవత్సరాలు కఠోర రహస్య జీవితాన్ని గడిపారన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, సామేల్, వెంకటరమణ, రాధాకృష్ణ, శంకర్, రాజు, నర్సింహారావు, కృష్ణ, గలిగ కృష్ణ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వాసం రాణి

దమ్మపేట, మార్చి 9: మండలంలోని నెమలిపేట గ్రామంలో డీపీఎల్–4 క్రికెట్ టోర్నమెంట్‌ను దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాసం రాణి ఆదివారం ప్రారంభించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ డప్పు ప్రదర్శన

మణుగూరు టౌన్, మార్చి 9: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేంత వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పులు కొడుతూ ప్రదర్శన చేశారు. మణుగూరు ప్రధాన రహదారిపై వినూత్న రీతిలో డప్పులు కొడుతూ ప్రదర్శన చేశారు.

లక్కినేని సురేందర్‌రావుతో మాట్లాడుతున్న రేగా కాంతారావు

పార్టీ అండగా ఉంటుంది..

అధైర్యపడొద్దు: రేగా

ఇల్లెందు, మార్చి 9: 'రాజకీయంగా 40 ఏళ్లుగా ప్రజల మధ్య ఉంటూ, వారికి సేవచేస్తున్న మీకు పార్టీ అధినాయకత్వం అండగా ఉంటుంది' అని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. అధైర్యపడొద్దని, పార్టీ అధినాయకత్వం అండగా నిలుస్తుందని బీఆర్ఎస్ నాయకుడైన లక్కినేని సురేందర్‌రావుకు ధైర్యం చెప్పారు. టేకులపల్లి మండల కేంద్రంలోని లక్కినేని సురేందర్‌రావు ఇంటికి ఆదివారం వచ్చిన రేగా కాంతారావు.. సురేందర్‌రావును పరామర్శించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. పీఏసీఎస్ చైర్మన్‌గా, జడ్పీటీసీగా, డీసీసీబీ డైరెక్టర్‌గా ఈ ప్రాంత ప్రజలకు సేవలందిస్తూ, 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటున్న సురేందర్‌రావుకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కేసీఆర్ నాయకత్వం ముందుకు సాగాలని, రాబోయే కాలం బీఆర్ఎస్‌దేనని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, చీమల సత్యనారాయణ, జయరాజ్, కొండబత్తుల శ్యామ్, రామకృష్ణ, వంశీ, సురేశ్, నాగేశ్వరరావు, పూజారి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్పీ' కార్యాలయంలో మహిళా దినోత్సవం

వేడుకలో ఎస్పీ సతీమణి మౌనిక, సిబ్బంది

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చ్ 9: ఎస్పీ క్యాంప్ కార్యాలయ ఆవరణలో ఆదివారం మహిళా దినోత్సవం జరిగింది. ఎస్పీ రోహిత్ రాజు సతీమణి, క్యాంప్ కార్యాలయ మహిళా సిబ్బంది కలిసి కేక్ కట్ చేశారు.

మహిళా రైతులకు సన్మానం

సన్మానం అందుకున్న మహిళా రైతులు

అశ్వారావుపేట రూరల్, మార్చి 8: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాసన్ సంస్థ ప్రతినిధులు ఆదివారం సన్మానించారు. సన్మాన గ్రహీతల్లో ఎం.సింగమ్మ, సారిన కాంతమ్మ, వెంకటలక్ష్మి, అఖిల, డి.జ్యోతి, కె.పార్వతి ఉన్నారు. వీరంతా.. వాసన్ సంస్థ పర్యవేక్షణలో జీవ ప్రాజెక్ట్ ద్వారా రసాయన ఎరువులకు దూరంగా, కేవలం సేంద్రియ ఎరువులతోనే వ్యవసాయం చేస్తున్నారు. కార్యక్రమంలో జీవ కమిటీ బాధ్యులు కొర్రి మల్లయ్య, దారా ప్రసాద్, వాసన్ సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూజారి జ్యోతికి 'ఉమెన్ ఐకాన్' అవార్డు

అవార్డు అందుకుంటున్న జ్యోతి

మణుగూరు టౌన్, మార్చి 9: మణుగూరుకు చెందిన గాయని పూజారి జ్యోతికి హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా విజ్‌డం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 'ఉమెన్ ఐకాన్ అవార్డు 2025'ను అందజేశారు. ఈ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని, మరింత బాధ్యత పెరిగిందని జ్యోతి తెలిపారు. జ్యోతికి అవార్డు రావడం పట్ల మణుగూరు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పుల్లమ్మకు నివాళి

పుల్లమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రేగా కాంతారావు

టేకులపల్లి, మార్చి 9: బూర్గంపాడు మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ జడ్పీచైర్మన్ పూన్నెం రామచంద్రయ్య సతీమణి పుల్లమ్మ ఇటీవల మృతిచెందారు. ఆదివారం మండలంలోని కో